ఏళ్లుగా బీళ్లు.. ఇంకెన్నాళ్లకో నీళ్లు

- చెంతనే సాగర్ కాలువ ఉన్నా అందని సాగునీరు
- ఎత్తిపోతల పథకం నుంచి పైప్‌లైన్ వేసేందుకు అధికారుల ప్రణాళిక
- ప్రభుత్వాలు మారుతున్నా ప్రారంభం కాని పనులు



ఎకలాస్‌ఖాన్‌పేట తండా వద్ద బీళ్లుగా ఉన్న 190 సర్వే నంబర్‌లోని భూములు

నడిగూడెం : చెంతనే సాగర్ ఎడమ కాల్వ ఉన్నా ఆ ప్రాంతానికి చుక్క సాగు నీరు అందడం లేదు. అయినా సాగు నీటి కోసం ఏళ్ల తరబడి రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా పాలకులు పట్టించుకోకపోవడంతో చేసేది ఏమీ లేక రైతులు ఖరీఫ్ సీజన్‌లో వర్షాధార పంటలు సాగు చేసుకుంటున్నారు. ఇదీ నడిగూడెం మండలం రామాపురం రెవెన్యూ పరిధిలోని 190 సర్వే నంబర్ భూముల పరిస్థితి.

190 సర్వే నంబర్‌లో..

190 సర్వే నంబర్ పరిధిలో నడిగూడెం మండలం రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, ఎకలాస్‌ఖాన్ పేట తండా, తెల్లబల్లి, మునగాల మండలం కృష్ణానగర్, బరాఖత్‌గూడెం, ముకుందాపురం, కోదండ రామాపురం, ఆకుపాముల గ్రామాలకు చెందిన రైతుల భూములున్నాయి. ఈ సర్వే నంబర్‌లో అనేక ఏళ్ల క్రితం 1600 ఎకరాల ప్రభుత్వ భూములను భూమి లేని పేద కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చింది. రైతుకు ఒక ఎకరం నుంచి రెండు ఎకరాల చొప్పున పంపిణీ చేసింది. నాడు రాళ్లతో ఉన్న భూములను రైతులు చదును చేసుకొని ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నారు.

పైపులైన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు

సాగర్ ఎడమ కాల్వకు అనుసంధానంగా కృష్టానగర్ సమీపంలో గల ఆర్– 9 ఎత్తిపోతల పథకం నుంచి ప్రత్యేక మోటార్ల ద్వారా నడిగూడెం, మునగాల మండలాల పరిధిలోని భూములు, 190 సర్వే పరిధిలో గల భూములకు నీరందించేందుకు గత ప్రభుత్వం పైప్‌లైన్ ఏర్పాటు చేసేందుకు 2019లో ప్రణాళిక సిద్ధం చేసింది. 7.50 కిలో మీటర్ల దూరం మేర సిమెంట్ గూనలు వేసి ప్రత్యేక పైపులైన్ నిర్మాణం కోసం అధికారులు రూ.8.50 కోట్లకు ప్రతిపాదనలు పంపగా నిధులు కూడా మంజూరు అయ్యాయి. కానీ పైప్‌లైన్ ఏర్పాటులో జాప్యం జరిగింది. కాగా, పైపులైన్ ఎక్కువ దూరం నిర్మించాల్సి వస్తుండడంతో సిమెంట్ పైపులు నీటి ఒత్తిడికి దెబ్బతింటాయని ఇనుప పైపులైన్ వేయాలని అధికారులు పాత ప్రణాళిక రద్దు చేసి కొత్త ప్లాన్ సిద్ధం చేశారు. ఈమేరకు రూ. 23 కోట్లకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. 2023లోనే నిధులు కూడా మంజూరయ్యాయి. కానీ ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. పైప్‌లైన్ పనులు పూర్తయితే మొత్తం 2500 ఎకరాల సాగుకు నీరు అందుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు త్వరితగతిన పైప్‌లైన్ ఏర్పాటు చేసి వానాకాలం సీజన్‌లో భూములకు సాగు నీరందించాలని రైతులు కోరుతున్నారు.

బోరు వేసినా నీటికి తిప్పలు



మాకు 190 సర్వే నంబర్‌లో భూమి ఉంది. కానీ సాగు నీరు రాకపోవడంతో ఏళ్ల తరబడి వర్షాధార పంటలు సాగు చేస్తున్నాం. గత ఏడాదే బోరు వేసి వరి సాగు చేపట్టా. ప్రస్తుత రబీ సీజన్‌లో భూగర్భ జలాలు అడుగంటడంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. మా భూములకు ప్రభుత్వం సాగర్ కాల్వ నీరు అందించాలి.

– బచ్చలకూరి ముత్తయ్య, రైతు, రామాపురం

పైపులైన్ వేసి నీరందించాలి



మా భూమిలో ఏళ్ల తరబడి మెట్ట పంటలు సాగు చేసుకుంటున్నాం. సాగర్ ఎడమ కాల్వకు అనుసంధానంగా ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేసి సాగు నీరు ఇస్తామని అనేక ఏళ్లుగా చేప్తున్నారు. కానీ ప్రభుత్వాలు మారుతున్నా నేటికీ నీరు ఇవ్వలేదు. అధికారులు త్వరగా పైపులైన్ ఏర్పాటు చేసి, వచ్చే వానాకాలం సీజన్‌లో సాగర్ నీరందించాలి.

– గుజ్జ ఆంజనేయులు, రైతు, రామాపురం

త్వరలో పనులు ప్రారంభిస్తాం

సాగర్ ఎడమ కాల్వకు అనుసంధానంగా ఉన్న ఆర్– 9 ఎత్తిపోతల పథకం నుంచి మునగాల, నడిగూడెం మండలాల్లోని భూములకు సాగు నీరందేలా ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి రూ.23 కోట్లకు ప్రతిపాదనలు పంపాం. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

– ఆనంద్, నీటి పారుదల శాఖ డీఈ, నడిగూడెం

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



గరిడేపల్లి : హుజూర్‌నగర్ సభకు వెళ్తున్న నాయకులు

మునగాల : హుజూర్‌నగర్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధికసంఖ్యలో తరలివెళ్లారు. ప్రతి గ్రామం నుంచి సంఘబంధం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు సభకు తరలివెళ్లారు. మండల కేంద్రంలోని ముత్యాలమ్మ వీధి నుంచి మండల నాయకుడు ఉప్పుల జానకిరెడ్డి ఆధ్వర్యంలో సీఎం సభకు వెళ్లారు.

నడిగూడెం : హుజూర్‌నగర్‌లో ఆదివారం జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. సభకు వెళ్లిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు బూతుకూరి వెంకటరెడ్డి, కోదాడ మార్కెట్ కమిటీ చైర్మన్ వేపూరి తిరుపతమ్మ, వెలుగు ఏపీఎం రామలక్ష్మి, మాజీ ఎంపీపీ యాతాకుల జ్యోతి, మాజీ జెడ్పీటీసీ బాణాల కవిత, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, తదితరులున్నారు.

పాలకవీడు : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో ఆదివారం హుజూర్‌నగర్‌లో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు సభకు ప్రజలు, పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్ మాట్లాడారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు కడుపునిండా భోజనం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. మండలం నుంచి దాదాపు ఏడు వేల మంది తరలివస్తున్నట్లు తెలిపారు.

మఠంపల్లి : హుజూర్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు మండలంలోని వివిధ గ్రామాలు, గిరిజన తండాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్‌లో జరుగుతున్న సీఎం రేవంత్‌రెడ్డి సభకు మండలంలోని లక్కవరం నుంచి మాజీ ఎంపీటీసీ చామకూరి గురుపాదం ఆధ్వర్యంలో గ్రామస్తులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : హుజూర్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు మండలంలోని ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. సభకు మండలంలోని అన్ని గ్రామాల స్వశక్తి మహిళలు, ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు వెళ్లారు.



మఠంపల్లి : సీఎం సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

రాధాకృష్ణమూర్తిశర్మకు ఉగాది పురస్కారం



రవీంద్రభారతిలో పండిత పురస్కారం అందుకుంటున్న రాధాకృష్ణమూర్తి శర్మ

మేళ్లచెరువు : మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వేదపండితుడు కొంకపాక రాధాకృష్ణమూర్తికి విశ్వావసు నామ ఉగాది పురస్కారం లభించింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను సన్మానించి పురస్కారం అందజేశారు. ఇప్పటి వరకు 76 మహచండీ యాగాలు, రుద్రయాగాలు, కోటి గాయత్రి యాగం ఎన్నో మహోత్తరమైన హోమాలు, పూజలు నిర్వహించినందుకు గాను ఉగాది పురస్కారం లభించినట్లు ఆయన తెలిపారు.

వెండి తమలపాకుల దండ బహూకరణ



దాత నాగేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నడిగూడెం : మండల పరిధిలోని శ్రీరంగాపురం శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామానికి చెందిన కందిమల్ల నాగేశ్వరరావు కృష్ణవేణి దంపతులు రూ.లక్ష విలువ చేసే వెండి తమలపాకుల దండను బహూకరించారు. ఈ సందర్భంగా దాత దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లు ప్రసాద్, సభ్యులు ఉప్పలయ్య, సత్యనారాయణ, పుల్లయ్య, మంగయ్య, వీరబాబు, సైదులు, గోవిందు, రహీముద్దీన్, యాదగిరి, హుస్సేన్, రంగయ్య, లింగయ్య, ప్రవీణ్‌కుమార్, శ్రీను, ఆలయ పూజారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

మఠంపల్లి : మండలంలోని కాల్వపల్లితండాలో గల శ్రీఆంజనేయస్వామి దేవాలయ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా బానోతు నాగరాజు, వైస్ చైర్మన్‌గా బానోతు రమేష్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా భీముడునాయక్, కోశాధికారిగా బాబునాయక్, కమిటీ సభ్యులుగా హనుమా, రంగా, బాలరాజు, హనుమంతు, కిషన్, బాలు, రూప్లా, చిన్నబాబు, కృష్ణ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్థికసాయం అందజేత

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని 6వ వార్డుకు చెందిన నిరుపేద ముస్లిం ఎస్‌కె సైదాపాష కుటుంబానికి రంజాన్ పర్వదినం సందర్భంగా ఆదివారం బీఆర్‌ఎస్ పట్టణ నాయకులు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సైదులు, హుసెన్, చందమళ్ల జయబాబు, పిచ్చిరెడ్డి, రాజేష్, నవీన్‌కుమార్, శ్రీను, భిక్షంరెడ్డి తదితరులున్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

పాలకవీడు : హుజూర్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో బహిరంగ సభకు ఎలాంటి ఆటంకం కలగకుండా మండలంలో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులను ఆదివారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పార్టీ నాయకులు మాట్లాడారు. పేదల కోసం తలపెట్టిన పథకాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

నాయకుల ముందస్తు అరెస్ట్

హుజూర్‌నగర్ : పట్టణంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పోలీసులు బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఎం పార్టీల, ప్రజాసంఘాలకు చెందిన పలువురు నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో ఆయా పార్టీల నాయకులు ముల్కలపల్లి రాంబాబు, అంబళ్ల నరేష్, పల్లె వెంకటరెడ్డి, శీలం శ్రీను, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

మఠంపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య విమర్శించారు. ఆదివారం మండల పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను హుజూర్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సభ నేపథ్యంలో ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకుల అరెస్టను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అరెస్ట్ అయిన వారిలోమాజీ సర్పంచ్‌లు మన్నెం శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనరసింహరాజు, రామచంద్రయ్య, కోటానాయక్, హఫీజ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

నేరేడుచర్ల : హుజూర్‌నగర్‌లో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభ నేపథ్యంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్, బీఆర్‌ఎస్ నాయకులను ఆదివారం మండల పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. అక్రమ అరెస్టులు చేయడంతో ఉద్యమం ఆగుతుందని అనుకోవడం భ్రమ మాత్రమేనని అన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి వాస పల్లయ్య, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సెన్, పీవైఎల్ నాయకులు వాప కరుణాకర్, బీఆర్‌ఎస్ నేతలు రాపోలు నవీన్‌కుమార్, ఇంజమూరి రాజేష్, చిట్యాల శ్రీను తదితరులున్నారు.

నూతన కమిటీకి సన్మానం

నేరేడుచర్ల : పట్టణంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన నేరేడుచర్ల ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని శనివారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి మాట్లాడారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు టీఎస్ స్వామి, ప్రధాన కార్యదర్శి బుడిగ శంకర్, కోశాధికారి సట్టు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు అలక సైదిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఈగ శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షులుగా చామకూరి వీరయ్య, గుంజ రవీందర్, సహాయ కార్యదర్శులు యారవ సురేష్, దేవులపల్లి శంకరాచారి, తునికపాటి బాలకృష్ణ, ముఖ్య సలహాదారులు పర్వతం పరమేష్, కార్యవర్గ సభ్యులు కొణతం అనిల్‌రెడ్డి, రావిరాల యుగేందర్‌లను సత్కరించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జిల్లా ఆరోగ్య శిబిరాల ఇన్‌చార్జ్ రాచకొండ శ్రీనివాస్‌రావు, కందిబండ శ్రీనివాస్‌రావు, కందిబండ వాసంతి, లక్ష్మణ్, గెల్లి లక్ష్మీనర్సింహారావు, శ్రీనివాస్‌రావు, జ్యోతి, నటరాజ్, రమేష్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు ఉన్నారు.

సేవాగుణం కలిగి ఉండాలి



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ పరమేష్

మేళ్లచెరువు : యువత సేవాగుణం కలిగిఉండాలని ఎస్‌ఐ పరమేష్ అన్నారు. ఆదివారం మండలంలోని జగ్గతండాలో బాణోతు సైదానాయక్ జ్ఞాపకార్థంగా వారి కుమారులు సుధాకర్‌నాయక్, ప్రసాద్‌నాయక్‌ల ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత గ్రామాభివృద్ధికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొట్టె సైదేశ్వరరావు, మాజీ సర్పంచ్ బాణోతు బాబు, మాజీ ఎంపీటీసీ టీకం, జయరాంనాయక్, రామారావు, వంశీ, మురళీ, సైదా, విజయ, మంజుల, బుర్రా శ్రీనివాస్, సహదేవ, సుబ్బారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు మంచి జరగాలి : ఎమ్మెల్యే



కోదాడ : ఉగాది వేడుకలో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి తదితరులు



కోదాడ : కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు

కోదాడ : పట్టణంలోని పబ్లిక్‌క్లబ్ ఆవరణలో ఆదివారం జరిగిన తెలుగు సంవత్సరాది వేడుకల్లో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నూతన తెలుగు సంవత్సరం శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలకు మంచి జరగాలని భగవంతున్ని ప్రత్యేకంగా కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం పూజారులు చేసిన పంచాంగ శ్రవణాన్ని ఆమె విన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గాయం పట్టాభిరెడ్డి, బొల్లు రాంబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు, నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, మేకల వెంకట్రావ్, కరెంట్ రామిరెడ్డి, రావెళ్ల సీతరామయ్య, వాచేపల్లి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనాలు సాహిత్యాభిరుచిని పెంపొందిస్తాయి

కోదాడ : తెలుగు సంవత్సరాదిన కవి సమ్మేళనాలు సాహిత్యాభిరుచిని పెంపొందిస్తాయని మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణ పరిధిలోని రంగనిగుడిలో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలుగు సంప్రదాయాలను పాటిస్తూ ప్రతి సంవత్సరం ఇక్కడ కవి సమ్మేళనాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా దాదాపు 30మంది కవులు తమ కవితలను చదివి వినిపించారు. అనంతరం కవులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గుడుగుంట్ల రంగయ్య, రిటైర్డ్ తెలుగు అధ్యాపకుడు మంత్రి ప్రగడ భరతరావు, కోదాడ రచయితల సంఘం అధ్యక్షుడు పుప్పాల కృష్ణమూర్తి, కవి సమ్మేళన కన్వీనర్ ఎస్ఎస్.రావు, వేనేపల్లి శ్రీనివాసరావు, కొమరగిరి రంగారావు, ఆలయ పూజారి రాఘవాచార్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

చిలుకూరు : మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఆదివారం ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం ఆలయాల్లో పూజారులు విశ్వావసు నామ నూతన సంవత్సరం పంచాంగం వినిపించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఆదివారం ఉగాది పర్వదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ షిర్డీసాయిబాబా మందిరంలో పంచామృతం అభిషేకాలు నిర్వహించారు. అలాగే నడిగూడెం, సిరిపురం శ్రీ కోదండ రామస్వామి ఆలయాలలో అర్చకులు వరదాచార్యులు, చక్రధరాచార్యులు పంచాంగంశ్రవణం చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మునగాల : మండల వ్యాప్తంగా ఆదివారం ఉగాది వేడుకలను వివిధ వర్గాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని రామాలయం, అయ్యప్ప దేవాలయంలో దేవాలయ కమిటీల ఆధ్వర్యంలో అర్చకులు పంచాంగ శ్రవణం వినిపించారు. రామాలయంలో వారణాసి కిశోర్‌శర్మ, అయ్యప్ప ఆలయంలో పూజారి నరపనేని రామారావు గురుస్వామి పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు పెద్దలు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : పట్టణంతో పాటు మండలంలో ఉగాది వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ఆలయాల్లో పంచాంగ శ్రవణం సంప్రదాయబద్ధంగా జరిపారు. పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో వేదపండితులు మొలుగు శ్రీనివాసాచార్యులు, ఆలయ ప్రధాన పూజారి ఉపేంద్రశర్మ, అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో గ్రామ పురోహితులు, వేదపండితులు నేమ్మాని వెంకటరమణ, ఆలయ ప్రధాన పూజారి ఉగ్రదండి శివప్రసాద శర్మల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, రాచకొండ రామకోటేశ్వరావులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో రాచకొండ మాధవరావు, వెంకటరమణరావు, గోపాల్‌రెడ్డి, అప్పిరెడ్డి, అంజయ్య, విజయలక్ష్మి, శ్రీనివాస్‌రావు, సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, సుధాకర్, సైదయ్య, సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, శోభ, అరుణ, రంగనాయకమ్మ తదితరులున్నారు.

గరిడేపల్లి : మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా ఆలయాలలో పూజారులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. కార్యక్రమంలో పూజారులు కొంపల్లి కృష్ణశాస్త్రి, సుదర్శనం శ్రీనివాసచార్యులు, సుదర్శనం రాజంచార్యులు, సుబ్బయ్యశర్మ, రాయపోలు శ్రీరామశర్మ, రాయపోలు భద్రశర్మ, పలువురు పూజారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



నేరేడుచర్లలోని శ్రీకోదండ రామాలయంలో పంచాంగ శ్రవణం చదువుతున్న పురోహితుడు



చిలుకూరు : చెన్నకేశవ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



నడిగూడెం శ్రీకోదండరామస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చదువుతున్న అర్చకుడు



హుజూర్‌నగర్ సీఎం సభలో కళాకారుల డోలు విన్యాసాలు



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో గిరిజన మహిళలు, నాయకులు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



హుజూర్‌నగర్ సీఎం సభలో ఏపూరి సోమన్న ఆటపాట

ఊపందుకున్న 'ఉపాధి' పనులు



ఫార్మేషన్ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న ఉపాధిహామీ కూలీలు



నర్సింహాపురం చెరువులో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

- పంట కాల్వల్లో పూడికతీత, రోడ్లవెంట కంపచెట్ల తొలగింపు
- ముమ్మరంగా డొంకదారుల మరమ్మతులు
- కొనసాగుతున్న పశువుల కొట్టాల నిర్మాణ పనులు
- పనుల్లో పాల్గొంటున్న 2300మంది కూలీలు

మోతె : మండలంలో ఉపాధిహామీ పనులు ఊపందుకున్నాయి. గ్రామాల్లో ప్రజల వలసలు నివారించి సొంత గ్రామాల్లోనే పనులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా మండల వ్యాప్తంగా ఉపాధిహామీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండలంలో 29గ్రామపంచాయతీల నుంచి జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీ ఉపాధి పనులు వినియోగించుకుంటున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను మండల వ్యాప్తంగా సుమారుగా 2300మంది కూలీలు గత నెల రోజుల నుంచి ఉపాధిపనుల్లో పాల్గొంటున్నట్లు అధికారులు వెల్లడించారు. పనుల్లో భాగంగా రైతులకు ఉపయోగపడే ఫీడర్ చానల్లు, పంట కాల్వల్లో పూడికతీత, రైతుల పొలాల వద్దకు వెళ్లే డొంకదారుల మరమ్మతులు, రహదారులకు ఇరువైపులా ఉన్న కంపచెట్లు తొలగింపు, చెరువుల్లో, కుంటల్లో రేగడిమట్టి తోలకం వంటి పనులు చేపడుతున్నారు. అదే విధంగా రైతుల పశువుల రక్షణకు ఉపాధి పథకంలో పశువుల కొట్టాల నిర్మాణం కొనసాగుతుంది. మండలంలో 80మంది రైతులకు పశువుల కొట్టాలు మంజూరు అయ్యాయి.

రోజువారీగా అధికారుల పరిశీలన..

మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను క్షేత్రస్థాయిలో మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఏప్రిల్, మే నెల సీజన్‌లో పనులు ముమ్మరంగా జరగనున్నాయి. మండలంలో ఉపాధి పనుల పరిశీలనతో పాటు రైతుల పశువుల కొట్టాల ఏర్పాటు పనులు, పండ్ల తోటల ఏర్పాటు పనులు అను నిత్యం పరిశీలిస్తున్నారు.

జాబ్‌కార్డు ఉన్న అందరికీ పని కల్పిస్తున్నాం



మండలంలో జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పిస్తున్నాం. గత ఏడాది కంటే ఈ సంవత్సరం కూలీలకు ఎక్కువ దినాలు కల్పిస్తాం. ఉపాధిహామీ పథకంలో రైతులకు సంబంధించిన పండ్ల తోటలు, పశువుల కొట్టాలు, ఫౌల్ట్రీ ఫాంల నిర్మాణాలకు సంబంధించి పలు సబ్సిడీలు ఉన్నాయి. వాటిని రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. మండలంలో 80పశువుల కొట్టాలు మంజూరు కాగా సుమారుగా 30 కొట్టాల నిర్మాణం పూర్తి చేశాం.

– టి.ఆంజనేయులు, ఎంపీడీఓ, మోతె